బాలానగర్ : మాజీ హోంమంత్రి మహమూద్ అలీకి కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ ఎజాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆజంపురలోని తన కార్యాలయంలో శాలువాతో సన్మానించి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 3: వసంత నగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం గంటల వరకు గోకుల్ ఫ్లాట్స్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

మాదాపూర్ : ఫీడర్ మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చందానగర్ ఏఈ దీప్తి తెలిపారు. 11 కె.వి. మార్తాండ నగర్ పరిధిలోని మార్తాండ నగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కె.వి. హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలోని ప్రకాశ్ నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయానున్నట్లు తెలిపారు.

కుత్బుల్లాపూర్ : పేట్ బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ సన్మాన్ బెల్మోర్ ఫీడర్ పరిధిలో సన్మాన్ విల్లాలు, వుడ్స్ కాలనీ, యాదిరెడ్డి బండ, సయ్యద్ నగర్, వైష్ణవి మెడోస్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ బాలాజీ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో హై టెన్షన్ రోడ్ ఏరియా, కాస్ హోటల్, ఎస్‌పీజీ గ్రాండ్, గ్రీన్ అవెన్యూ గేట్ నం.1,2 3, అంగడిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ప్రజావాణి'లో వినతుల వెల్లువ

మియాపూర్ : శేరిలింగంపల్లి జోన్ సమస్యల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

మియాపూర్, మార్చి 3 : శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయంతో పాటు శేరిలింగంపల్లి, చందానగర్ ,యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు సర్కిళ్లలో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 22 వినతులు అధికారులకు అందాయి. జోనల్ కార్యాలయంలో 3, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 12, యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో 4 ,చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్‌కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు.

కమిషనర్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. చందానగర్ సర్కి కార్యాలయంలో డీసీ మోహన్ రెడ్డి ఆయా విభాగాల అధికారులతో ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.

కూకట్‌పల్లి జోన్‌లో 14 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 3 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 7 , ఇంజినీరింగ్ విభాగానికి 5 , ఎలక్ట్రికల్ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. మూసాపేట్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి లో 5 ఫిర్యాదులు రాగా.. వచ్చిన 5 ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్ విభాగానివేనని డీసీ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు రాగా.. టౌన్ ప్లానింగ్ విభాగానికి 4 ఫిర్యాదు వచ్చినట్లు డీసీ గంగాధర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఇంటి పన్ను భారాన్ని తగ్గించాలని..

కుత్బుల్లాపూర్, మార్చి3: కుత్బుల్లాపూర్ సర్కిల్ 131వ డివిజన్ అంబేద్కర్ నగర్ లో ఇంటి పన్ను భారం అధికంగా అవుతుందని దానిని తగ్గించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డీసీ నరసింహకు కాలనీవాసులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలో 60 గజాల స్థలంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం కేవలం 6000 మాత్రమే ఇంటి పని వచ్చేదని కానీ ఇప్పుడు రెండింతలు ఎక్కువగా అవుతుందన్నారు.

దీనికి తోడు నాలుగేండ్లుగా పెండింగ్ బిల్లులు చూపించి ఏకకాలంలో పన్ను భారాన్ని మోపారని, దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అధిక ఇంటి పన్ను భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేశ్ ముదిరాజ్, సభ్యులు ఉపేందర్ చారి, ఉమా మహేశ్వర్, శ్రీనివాస్, రాజేశ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి లో సమస్యలపై ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 7 సమస్యలు, గాజుల రామారం సర్కిల్ పరిధిలో రెండు సమస్యల చొప్పున ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్లు నరసింహా, మల్లారెడ్డి తెలిపారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీకి వినతి పత్రం అందజేస్తున్న అంబేద్కర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్ : సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న గాజులరామారం డీసీ మల్లారెడ్డి

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



హస్మత్‌పేట సామాజిక భవనంలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్ : ప్రజా సంక్షేమానికి సామాజిక భవనాల్లో (కమ్యూనిటీ హాల్) సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట, అంజయ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈ ఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ ఆశ, జలమండలి తేజ, బీఆర్ఎస్ నాయకులు నరేందర్ గౌడ్, ఇర్ఫాన్ మేకల హరి నాథ్, మక్కల నర్సింగ్‌రావు, మక్కల సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

నేరరహిత సమాజ నిర్మాణానికి సీసీ కెమెరాలు

బాలానగర్ : నేరరహిత సమాజ నిర్మాణానికి సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఏసీపీ హనుమంతరావు అన్నారు. సోమవారం బాలానగర్ పీఎస్ పరిధిలోని రాజు కాలనీ ఏలిమ్ ఎంబీ చర్చ్ వారు ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాలను సీఐ నరసింహ రాజు, ఎస్సై రామ్ నారాయణతో కలిసి ఏసీపీ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నామని కుతుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. వివిధ ప్రాంతాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు , సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం శంభీపూ ర్ కృష్ణను ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పం దిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్లో మా ట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకు..

కేపీహెచ్‌బీ కాలనీ : బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జేఎన్టీయూహెచ్ మెట్రోస్టేషన్ పక్కన ఇగ్నైట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కొర్లకుంట రమేశ్, స్థానిక నాయకులు వైఎస్ ప్రసాద్, అచ్యుతరామయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, తులసి, విష్ణు, ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్ : ఎల్ఆర్ఎస్ రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. అనధికార లేఅవుట్లకు 2020లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 31లోగా ఫీజు చెల్లించే వారికి ప్రభుత్వం 25% రాయితీ ఇవ్వనుందన్నారు. ఏవైనా అనుమానాలు ంటే మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఇబ్బంది సైతం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



పనులపై కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పోరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, మార్చి 3 : శ్రీల గార్డెన్స్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సోమవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో, సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీలలో మెరుపైన రవాణా సౌకర్యం కోసం సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణాన్ని ప్రాధాన్యతతో పూర్తి చేస్తున్నట్లు కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్, నవీన్,కాలనీ వాసులు సంతోష్, ఫణి, చేతన్, గోపాల్ , వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. డివిజన్ గురించిన హై టెన్షన్ లైన్ లో విజయదుర్గ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవానికి కార్పొరేటర్ నార్ని శ్రీనివాస్ రావుతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. పూజలు చేసి ఆశీర్వాదం అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోరునీటిలోకి.. డ్రైనేజీ వాటర్



మాదాపూర్, మార్చ్ 3 : మ్యాన్ హోల్ లీకేజీ కావడంతో బోర్ నీటిలో కలిసి కలుషితమవుతున్నాయని మార్తాండ నగర్ కాలనీలోని వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు హైమావతి అన్నారు. కొండాపూర్ డివిజన్ మార్తాండ నగర్ లో డ్రైనేజీ మ్యాన్ హోల్ లీకేజీ కావడంతో భూమిలో చేరి బోర్ ద్వారా కలుషిత నీరు ఇండ్లలోకి రావడంతో కాలనీ అసోసియేషన్ సభ్యులు స్థానికులతో కలిసి సోమవారం జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మార్తాండ నగర్ కాలనీ, గణేశ్ టెంపుల్ 40 ఫీట్ రోడ్డులో రోడ్డు నం.5,6లో డ్రైనేజీ లీకేజీ కావడంతో అవి కాస్త భూమిలో ఇంకి ఇండ్లలోకి కలుషిత నీరు వస్తుందన్నారు. నీరు నలుపు, పసుపు రంగులో వచ్చి దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా బోర్ నీటిని వాడడం మానేసి గోదావరి నీళ్లు పై ఆధారపడుతున్నారని, సరిపోక ట్యాంకర్ల ద్వారా తెప్పించుకుంటున్నట్లు పేర్కొన్నారు. మ్యాన్ హోల్ నాణ్యతతో నిర్మించకపోవడంతో, కింద కంకర మాల్‌ని సరిగా కలిపి వేయకపోవడంతో పంది కొక్కులు రంధ్రాల నుంచి మట్టి లాగడం, రాఘవేంద్ర కాలనీ మ్యాన్‌హోల్ సరిగా లేకపోవడంతో భూమిలో చేరిందని తెలిపారు. కలుషిత నీరు ఇండ్లలోకి రావడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించగలరని కోరారు.

బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను పెంచుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 3: బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి. కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. జేఎన్టీయూహెచ్ వర్సిటీలో యూజీసీ మాలవ్యమిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 6 వరకు.. బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి అన్న అంశంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ శిక్షణ తరగతులను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. అధికారిక కమ్యూనికేషన్, నోట్ తయారీ, పరిపాలన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ నైపుణ్యాలు, ఆడిట్ సమాధానాలు, బడ్జెట్ అండ్ ఖర్చుల నిర్వాహన, కొనుగోలు విధానాలు, సేవా నియమాల అవగాహన, పే ఫిక్సేషన్, పెన్షన్ లెక్కల వంటి పరిపాలన అంశాలపై పట్టును సాధించాలని సూచించారు. బోధనేతర సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు విశ్వవిద్యాలయ పరిపాలన సమర్థవంతంగా నిర్వహించడానికి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం. సుష్మ, కో -ఆర్డినేటర్ సురేందర్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీలో బోధనేతర సిబ్బందికి శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి , రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 23, కాకర 32, బీర 35, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 45, చిక్కుడు 45, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 32, ఆలుగడ్డ 20, కీరా 18, దోస 26, సోర 15, పొట్ల (1) 18, కంద 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 34, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడి 30, నిమ్మకాయలు(12) 40 నుంచి 50, మునగ (1) 8 నుంచి 10, పచ్చి బఠానీ 40, పొప్పడి 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 180, అల్లం 80, వెల్లుల్లి 120, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

9న జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం

బాలానగర్ : జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం రాందేవ్ రావు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాల రాజు తెలిపారు. ఈనెల 9న కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీ లోని ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రి యాజమాన్యం జర్నలిస్టుల సంక్షేమం కోసం వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించేందుకు సుముఖంగా ఉందని తెలియజేశారు. పరీక్షలు చేయడమే కాక డాక్టర్లతో పర్యవేక్షణ చేయించేందుకు ఆసుపత్రి ముందుకు వచ్చిందని తెలియజేశారు. గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత అన్ని రకాల రక్త పరీక్షలు ఎముకలకు సంబంధించిన పరీక్షలు షుగర్, క్యాన్సర్, స్కీనింగ్, మహిళలకు గైనిక్ పరీక్షలు, కళ్లు, దంతాల పరీక్షలతో కలిపి రూ. 30 వేల ఖర్చుతో కూడిన పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలియజేశారు. పరీక్షలు చేసుకోవాల్సిన వారు మార్చి 5 లోపు తన పేరు కుటుంబ సభ్యుల వివరాలు పత్రిక పేరు ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. మార్చి 9వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

చరిత్ర, సంస్కృతిని భావి తరాలకు తెలియజేయాలి

మేడ్చల్, మార్చి 3: కనుమరుగు అవుతున్న చరిత్రను, సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామాస్వామి రెడ్డి అన్నారు. లోకమాత అహల్య బాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంత్యుత్సవాలు సోమవారం కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలోవిద్యార్థుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ.. ఆటో డ్రైవర్ మృతి

శేరిలింగంపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. కొడియార్ మండలం, వాల్యానాయక్ తండాకు చెందిన కాట్రవత్ భీమ(32) నగరానికి వలసవచ్చి ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1న తెల్లవారు జామున 3 గంటల సమయంలో తనఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని గచ్చిబౌలి ఏఐజీ దారిలో ప్రయాణిస్తున్నాడు. బాంబూస్ విల్లాస్ సమీపంలో వెనక నుంచి వేగంగా దూసుకు వచ్చిన హుందాయ్ కారు ఆటోను ఢీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ భీమకు తీవ్ర గాయాలు కాగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మూతపడ్డ కెమికల్స్ ఫర్టిలైజర్ కంపెనీని తెరవాలి

రామంతపూర్,మార్చి3: మూతపడ్డ హైదరాబాద్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీని మళ్లీ ఓపెన్ చేయాలని ఆ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారంమౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆ కంపెనీని యూనియన్ నాయకులు వెళ్లి పరిశీలించారు. ఆనంతరం జయశంకర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షులు వి.మురళీ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం. జాన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులు, సల్ఫ్యూరిక్ యాసిడ్, సల్ఫర్ పాస్ఫెట్,ఫర్టిలైజర్స్ మిక్సర్, నత్రజని, హైడ్రోక్లోరిక్ యాసిడ్, మెగ్నీషియం సల్ఫేట్ వంటి ఉత్పత్తులను అందించిన కంపెనీగా ఎంతో పేరుందన్నారు. లాభాల్లో ఉన్న కంపెనీనీ ఏపీ స్టేట్ ఆగ్రోఇండస్ట్రీస్ కార్పొరేషన్ జా యింట్ వెంచర్‌గా తీసుకున్నారన్నారు.ఆగ్రో ఇండస్ట్రీస్ నిర్లక్ష్యంతో 30 సంవత్సరాల క్రితం 1987 జూలై 3న లిక్విడేటర్ను అపాయింట్మెంట్ చేసిన ప్పటికీ పూర్తి ప్రాసెస్ చేయకుండా కంపెనీనీ మూసేశారన్నారు. సరైన సెక్యూరిటీ లేని కారణంగా ఆ కంపెనీలో ఎం తో విలువైన మిషనరీ పాడైపోవడంతో పాటు దొంగల పాలైందన్నారు. దాదా పు 24ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కంపెనీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వివరించా రు. ఇప్పటికే కంపెనీ భూములు దాదాపు 50 శాతం వరకు కబ్జాలకు గురైనట్లు వారు పేర్కొన్నారు. కంపెనీ భూముల్లో టెరిటరీ ట్రీట్మెం ట్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై త్వరలో ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి సమస్యను విన్నవిస్తామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కంపెనీని తిరిగి ప్రారంభించేందకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అన్యాక్రాంతమైన కంపెనీ భూములను హైడ్రా ద్వారా స్వాధీనం చేసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు.ఈ సమావేశంలో యూనియ న్ వర్కింగ్ ప్రసిడెంట్ సత్తయ్య, జాయింట్ సెక్రటరీ మల్లేశ్, జాకబ్ తదితరులున్నారు.

కంపెనీ ఎదుట నిరసన తెలుపుతున్న యునియన్ నాయకులు